నమస్తే తెలంగాణ
జోగుళాంబ గద్వాల వనపర్తి
5 మహబూబ్‌నగర్, శుక్రవారం 9 ఫిబ్రవరి 2024
JOGULAMBA GADWAL WANAPARTHY



చలో నల్లగొండ వాల్ పోస్టర్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి

# చలో నల్లగొండకు తరలుదాం

- కృష్ణానది హక్కులను కాపాడుకుందాం : గద్వాల ఎమ్మెల్యే బండ్ల

గద్వాల, ఫిబ్రవరి 8 : బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ తలపెట్టిన 'చలో నల్లగొండ' కార్యక్రమాన్ని విజయవంతం చేద్దామని, కృష్ణానది హక్కులను కాపాడుకుందామని గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి అన్నారు. గురువారం సాయంత్రం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో చలో నల్గొండ కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్‌ను బీఆర్ఎస్ నాయకులతో కలిసి ఎమ్మెల్యే విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో మన నీళ్లు మనం వాడుకొని రైతు రాజులా బతికాడన్నారు. కానీ ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం తొందరపాటు విధానాలతో, కృష్ణానది ప్రాజెక్టులను కేంద్రంలోని కేఆర్ఎంబీకి అప్పగించి మన పొలాలను ఎండబెట్టే విధానాలకు పాల్పడుతున్నది. పెద్దలు, మేధావులు చెప్పినా ఒంటెద్దు పోకడలతో కేఆర్ఎంబీకి వత్తాసు పలుకుతున్నదన్నారు. ఈ విధానాలను నిరసిస్తూ ఈనెల 13న నల్లగొండలో బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఆధ్వర్యంలో నిర్వహించే ప్రజాభేరికి జిల్లా నుంచి రైతులు, ప్రజలు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివచ్చి తెలంగాణ హక్కులను కాపాడుకుందామని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ కేశవ్, ఉమ్మడి జిల్లా డైరెక్టర్ సుభాన్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోవిందు, కౌన్సిలర్లు మహేశ్, నాగిరెడ్డి, నరహరి శ్రీనివాసులు, దౌలు, కృష్ణ, నాగరాజు, నాయకులు ధర్మనాయుడు, రామకృష్ణ, వంశీ, రిజ్వాన్, మోబిన్, అన్వర్, మధు, పవన్, జగదీశ్, వీరేశ్, రాజు పాలొన్నారు.



కొంకలలో రోడ్డు పనులు అడ్డుకొని ధర్నా చేస్తున్న రైతులు

# భూముల పరిహారం పెంచాలి

- కొంకల వద్ద రైతుల ధర్నా

వడ్డేపల్లి, ఫిబ్రవరి 8 : భారత్‌మాల రోడ్డులో కొంకల, జులేకల్ శివారులోని రైతుల భూములు పోగా వాటికి పరిహారం పెంచాలని కోరుతూ కొంకల వద్ద గురువారం రైతులు ధర్నా నిర్వహించారు. సుమారుఐ దుగం టలపాటునిర్వ హించిన ఆందోళనతో భారత్‌మాల రోడ్డు పనులకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ నేషనల్ రహదారి 150సీ పరిధిలో భూసేకరణ చట్టం కింద తీసుకున్న భూములకు ఎకరం తరి పొలానికి రూ.7.17 లక్షలు, మెట్ట భూమికి రూ.4.50 లక్షలు మాత్రమే ఇచ్చారని, ఇక్కడ ఎకరాకు రూ.30 లక్షల నుంచి రూ.40లక్షలు పలుకుతుందన్నారు. ప్రభుత్వం భూముల ధరలు పెంచాలని డిమాండ్ చేశారు. దీనిపై ఇది వరకే కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామని, అధికారులు వచ్చి క్షేత్రస్థాయిలో పర్యటించి రైతుల వివరాలు సేకరించారన్నారు. కానీ ఇంత వరకు భూముల ధర పెంపు విషయం మాత్రం చెప్పడం లేదన్నారు. భూముల ధరలు పెంచకపోతే తీవ్రంగా నష్టపోతామని, మాకు న్యాయం జరగకపోతే జిల్లా కేంద్రంలో నిరసన కార్యక్రమాలు చేపడతామని వారు హెచ్చరించారు. కార్యక్రమంలో రైతులు రాజమోహన్‌రెడ్డి, హరికృష్ణారెడ్డి, మద్దిలేటి, లక్ష్మీకాంతరెడ్డి, కృష్ణ, నాగన్న, భీముడు, బ్రహ్మంరెడ్డి, బొంకూరు రాజన్న, రామారావు, సుధాకర్, రఘు, నర్సింహులుతోపాటు కొంకల, జులేకల్ శివారు రైతులు పాల్గొన్నారు.



చారకొండలో రాస్తారోకో చేస్తున్న గ్రామస్తులు

# బైపాస్ రోడ్డు పనులు ఆపాలి

- చారకొండలో రాస్తారోకో

చారకొండ, ఫిబ్రవరి 8: జడ్చర్ల–కోదాడ జాతీయ రహదారిలో చారకొండ వద్ద చేపట్టిన బైపాస్ రోడ్డు నిర్మాణ పనులు నిలిపివేయాలని డిమాండ్ చేస్తూ చారకొండ గ్రామస్తులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రోడ్డు మూలమలుపులు ఉన్నాయనే సాకుతో చారకొండలో బైపాస్ రోడ్డు నిర్మించడం వల్ల నిరుపేదలకు చెందిన ఇండ్లు, ప్లాట్లు, వ్యవసాయ భూములు కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఉన్న రోడ్డునే విస్తరిస్తే ఎవరికీ ఎలాంటి నష్టం జరగదని, ఈ విషయాన్ని పలుమార్లు ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోవడం లేదని ఆరోపించారు. మల్లేపల్లి–కల్వకుర్తి వరకు మలుపులు ఉన్నాయనే సాకుతో రోడ్డును విస్తరించి.. చారకొండలో మాత్రం బైపాస్ నిర్మాణం చేపట్టడం ఎంత వరకు సమంజసం అని ప్రశ్నించారు. ఇప్పటికైనా జాతీయ రహదారి ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి బైపాస్ పనులు వెంటనే నిలిపి వేసి ఉన్న రోడ్డునే విస్తరించి న్యాయం చేయాలని కోరారు. విషయం తెలుసుకున్న ఎస్సై రాజశేఖర్ అక్కడికి చేరుకొని జిల్లా అధికారులతో మాట్లాడిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో నాయకులు బాల్‌రాంగౌడ్, శంకర్‌గౌడ్, గణేశ్, వెంకటయ్యగౌడ్, లక్ష్మయ్యగౌడ్, సత్యం, విష్ణు, సత్తార్, శ్రీను, శివ, గిరిజ, రమేశ్, అశోక్, సుదర్శన్ పాల్గొన్నారు.



కొనుగోలుచేసిన వేరు శనగనుడీ సీఎంలోత రలిస్తున్న వ్యాపారులు

# సజావుగా క్రయవిక్రయాలు

- అచ్చంపేటలోవేరు శనగకుధరపెం చడంతో శాంతించినరై తులు

అచ్చంపేట రూరల్, ఫిబ్రవరి 8 : అచ్చంపేట మార్కెట్‌లో వేరుశనగ రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని బుధవారం ఆందోళన నిర్వహించిన విషయం విధితమే. గురువారం మార్కెట్ చైర్‌పర్సన్ అరుణ, మార్కెట్ కార్యదర్శి నర్సింహులు, ట్రేడర్లు, వ్యాపారులు, రైతులతో చర్చించి గిట్టుబాటు ధర కల్పించే విధంగా చర్యలు తీసుకున్నారు. దీంతో గురువారం మార్కెట్‌లో క్రయవిక్రయాలు సజావుగా సాగాయి. వేరుశనగకు రూ.5 వేల నుంచి రూ.6 వేల మధ్య ధర పలికిన రైతులకు రూ.250 పెంచారు. అలాగే రూ.6,001 నుంచి రూ.6,400 మధ్య ధర ఉన్న రైతులకు రూ.125, రూ.6,401 నుంచి రూ.7 వేల మధ్య రేటు ఉన్న రైతులకు రూ.50 పెంచినట్లు మార్కెట్ కార్యదర్శి నర్సింహులు తెలిపారు. రైతులు, వ్యాపారుల మధ్య చర్చలు ఫలించడంతో వేరుశనగ రాశులను తూకాలు చేసి కొనుగోలు చేసిన ట్రేడర్లు తమ మిల్లులకు తరలించారు.




తుమ్మిళ్ల ఎత్తిపోతల పథకం

# ఆర్డీఎస్ ఆగమే..!

- కేఆర్ఎంబీకి ప్రాజెక్టులు అప్పగించడంతో నీలినీడలు
- రేవంత్ సర్కార్‌పై రైతన్నల్లో వెల్లువెత్తుతున్న ఆగ్రహం
- ఉమ్మడి రాష్ట్రంలోనూ కాంగ్రెస్, టీడీపీ పాలకుల నిర్లక్ష్యం
- నాడు సైతం పూర్తి స్థాయి నీటివాటాను వాడుకోని వైనం
- కేసీఆర్ ప్రభుత్వ హయాంలో సంబురంగా సాగు
- చివరి ఆయకట్టుకూ నీళ్లిచ్చేలా తుమ్మిళ్ల లిఫ్ట్ ఏర్పాటు
- నేడు నడిగడ్డ రైతుల పరిస్థితి అగమ్యగోచరం



నీళ్లు లేక వట్టిపోయిన ఆర్డీఎస్ కాల్వ

గద్వాల, ఫిబ్రవరి 8 : ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న అనాలోచిత నిర్ణయం వల్ల ఆర్డీఎస్ రైతుల పరిస్థితి అగమ్యగోచరంగా మారింది. టీడీపీ, కాంగ్రెస్ ప్రభుత్వాల నిర్లక్ష్యంతో తుంగభద్ర నీటిని అటు కర్ణాటక, ఇటు సీమాంధ్రపాలకులు అక్రమంగా తరలించుకుపోవడంతో ఏనాడూ ఆర్డీఎస్ చివరి ఆయకట్టుకు నీరందలేదు. కర్ణాటకలో కాంగ్రెస్ అధికారంలో ఉన్న సమయంలో ఆర్డీఎస్ నుంచి తెలంగాణకు రావాల్సిన నీటి వాటా గురించి ప్రశ్నించకపోవడంతో వారు అక్రమంగా లిఫ్టులు, మోటర్ల ద్వారా నీరు మళ్లించున్నారు. ఇప్పుడు రాష్ట్రంలో కూడా కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో నడిగడ్డ ప్రజలకు శాపంగా మారింది. ఇప్పటికే కర్ణాటక జలదోపిడీతో జోగుళాంబ గద్వాల జిల్లాలోని రాజోళిబండ మళ్లింపు పథకం (ఆర్డీఎస్) బండబారిపోయింది. కేంద్ర జలవనరుల సంఘం రాష్ట్రానికి కేటాయించిన నీటిని కూడా కర్ణాటక ఇవ్వకుండా దోచుకుంటున్నది. అయినా ప్రశ్నించే వారు లేరు.

ఆర్డీఎస్ పథకానికి 15.9 టీఎంసీల కేటాయింపులు ఉన్నాయి. దీని కింద 87,500 ఎకరాలకు సాగు నీరు అందాల్సి ఉన్నా.. కర్ణాటక అక్రమనీటి చౌర్యంతో ఏనాడూ 30 వేల ఎకరాలకు మించి నీరు అందలేదు. ఇప్పటివరకు మన నీటి వాటాల్లో ఏనాడూ ఐదు నుంచి ఆరు టీఎంసీలకు మించి నీటిని వాడుకోలేదు. ఉద్యమ నేత కేసీఆర్ నడిగడ్డలో పాదయాత్ర చేసిన సమయంలో ఆర్డీఎస్ రైతుల సమస్యలను గుర్తించారు. చివరి ఆయకట్టు వరకు నీరు అందిస్తానని ఆనాడే హామీ ఇచ్చారు. తెలంగాణ ఏర్పడిన తరువాత కేసీఆర్ సర్కారు అధికారంలోకి వచ్చిన వెంటనే తుమ్మిళ్ల లిఫ్ట్ ఏర్పాటు చేసి హామీని నిలబెట్టుకున్నది. ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడంతో తుమ్మిళ్ల లిఫ్ట్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి.

### తుమ్మిళ్లతో చివరి ఆయకట్టుకు నీరు..

ప్రత్యేక రాష్ట్రంలో తుమ్మిళ్ల లిఫ్ట్ ద్వారా చివరి ఆయకట్టు వరకు నీరు ఇవ్వాలని కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నారు. డీ–24 నుంచి డీ–40 వరకు ఉన్న చివరి ఆయకట్టుకు నీరందించేందుకు తుమ్మిళ్ల ఎత్తిపోతలను ప్రతిపాదించారు. రూ.783 కోట్లతో పరిపాలన అనుమతులు ఇచ్చారు. రూ.159 కోట్లతో మొదటి దశ పనులు పూర్తి చేసి నవంబర్ 2018 నుంచి సాగునీటిని అందించారు. ఈ ప్రాజెక్టు కింద 87,500 ఎకరాల ఆయకట్టు ఉన్నది. అయితే ఆర్డీఎస్ నీటి ద్వారా కేవలం 31,900 ఎకరాలకు మాత్రమే ప్రస్తుతం నీరు పారుతున్నది. తుమ్మిళ్ల ద్వారా మిగిలిన 55,600 ఎకరాలకు సాగునీరు అందించనున్నారు. అయితే ఈ ఎత్తిపోతలకు నీటిని తుమ్మిళ్ల గ్రామ సమీపంలో ఏర్పాటు చేసిన లిఫ్ట్ ద్వారా తీసుకుంటున్నారు. ప్రాజెక్టులు కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు పరిధిలోకి వెళ్లడంతో నీటిని వాడుకొనే హక్కును కోల్పోతాం. వారు అనుమతి ఇస్తే తప్పా నీటిని ఈ లిఫ్ట్‌కు వాడుకోలేని పరిస్థితి. రైతుల చివరి ఆయకట్టుకు తెలంగాణ ప్రభుత్వం నీరు అందిస్తే, ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం మళ్లీ ఆ భూములను బీడు భూములుగా మార్చే ప్రయత్నం చేసింది. ఇప్పుడిప్పుడే ఆర్డీఎస్ రైతుల భూములు పచ్చగా మారి రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందుతుంటే రేవంత్ సర్కారు నిర్ణయం వల్ల తిరిగి బీడు భూములుగా మారే పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగించడంపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని నడిగడ్డ రైతులు డిమాండ్ చేస్తున్నారు.



నీళ్లు లేకపోవడంతో ఎడారిని తలపిస్తున్న ఆర్డీఎస్ ఆనకట్ట


# ఆయిల్‌పాం బోర్డు ఏర్పాటు చేయాలి

- రైతులకుగిట్టుబాటు ధర కల్పించాలి
- వైద్యరంగ అభివృద్ధికి సహకరించాలి
- బీఆర్ఎస్‌ఎం పీలుమ న్నెశ్రీని వాస్‌రెడ్డి, రాములు, బీబీపాటిల్, ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి
- కేంద్రవ్య వసాయ, వైద్యారోగ్య శాఖల మంత్రులకు వినతి

మహబూబ్‌నగర్ అర్బన్, ఫిబ్రవరి 8 : తెలంగాణలో జాతీయ ఆయిల్‌పాం బోర్డు ఏర్పాటు చేయాలని, ఆయిల్‌పాం పండించే రైతులకు గిట్టుబాటు ధర కల్పించాలని బీఆర్ఎస్ ఎంపీలు మన్నె శ్రీనివాస్‌రెడ్డి, రాములు, బీబీ పాటిల్ గురువారం ఢిల్లీలో కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖల మంత్రి అర్జున్ ముండాను కలిసి వినతిపత్రం అందజేశారు. ఆయిల్‌పాం పండిస్తున్న రైతులకు గిట్టుబాటు ధర లేకపోవడంతో పెట్టుబడి కూడా రావడం లేదని మంత్రి దృష్టికి తీసుకుపోయారు. ప్రస్తుతం సాగు కోసం రూ.18 వేలు ఇవ్వడంతో రైతులకు ఇబ్బందిగా మారిందని దానిని కనీసం రూ.20 వేలకు పెంచి తెలుగు రాష్ట్రాల ఆయిల్ పాం రైతులను ఆదుకోవాలని వారు కోరారు.

### కేంద్ర ప్రభుత్వం సహకరించాలి..

గద్వాల /అచ్చంపేటటౌన్, ఫిబ్రవరి 8 : వైద్య రంగ అభివృద్ధికి సహకారం అందించాలని నాగర్‌కర్నూల్ ఎంపీ పోతుగంటి రాములు, గద్వాల ఎమ్మెల్యే బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి కేంద్ర వైద్య, ఆరోగ్యశాఖల మంత్రి మాండవీయకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గద్వాల నియోజకవర్గంలో గతంలో సరైన వైద్య సదుపాయాలు లేక ప్రజలు ఎన్నో ఇబ్బందులను ఎదుర్కొనేవారన్నారు. గద్వాల నుంచి కర్ణాటక ఆంధ్రప్రదేశ్ ప్రాంతాలకు వైద్య సదుపాయం కోసం వెళ్లేవారు. కానీ కేసీఆర్ ప్రభుత్వం గద్వాల ప్రభుత్వ దవాఖానలో అన్ని రకాల వైద్య సదుపాయాలు అందుబాటులో తీసుకువచ్చిందని, డయాలసిస్ సెంటర్‌ను, డయాగ్నోసిస్ సెంటర్‌ను ఏర్పాటు చేసిందన్నారు. అదేవిధంగా అప్పటి మంత్రి హరీశ్‌రావు సహకారంలో 300 పడకల దవాఖాన నిర్మాణం, నర్సింగ్, మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసుకున్నామని, అయితే వైద్య రంగాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కేంద్ర ప్రభుత్వం సహకారం అందించాలని కోరారు. దీనిపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీలు, ఎమ్మెల్యే తెలిపారు.





కేంద్ర మంత్రులకు వినతిపత్రం అందజేస్తున్న ఎంపీలు, ఎమ్మెల్యే

# ఎంపీడీవో వర్సెస్ పంచాయతీ కార్యదర్శి

- అధికారులు, ఉద్యోగుల మధ్య మాటల యుద్ధం
- అయోమయంలో ఎంపీడీవో కార్యాలయ సిబ్బంది
- పంచాయతీ కార్యదర్శిపై పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు

పెంట్లవెల్లి, ఫిబ్రవరి 8 : మండలకేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో పనిచేసే ఉద్యోగుల మధ్య రోజురోజుకూ పచ్చగడ్డి వేస్తే భగ్గుమంటున్నది. ఈ వ్యవహారం మూడు నెలల నుంచి కొనసాగుతుందని ఉద్యోగులు, సిబ్బంది బహిరంగంగా చెబుతున్నారు. దీనిని నిజం చేస్తూ ఎంపీడీవో రామయ్య పెంట్లవెల్లి పంచాయతీ కార్యదర్శి సాధిక్‌పై గురువారం పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో మరింత బహిర్గతమైంది. ఎంపీడీవో కార్యాలయ ఉద్యోగుల వివరాల ప్రకారం.. ఎంపీడీవో రామయ్య కింది స్థాయిలో పనిచేస్తున్న ఉద్యోగులతో అవసరం ఉందంటూ డబ్బులు తీసుకొనే వారు. ఉద్యోగులు, సిబ్బంది తిరిగి డబ్బులు అడిగితే ఏదో వంకతో ఆగ్రహం వ్యక్తం చేస్తూ మాపైనే నిందలు మోపుతూ జిల్లా అధికారులకు ఫిర్యాదు చేసేవాడని ఆరోపిస్తున్నారు. ఇదే విషయంలో పంచాయతీ కార్యదర్శి సాధిక్ మాట్లాడుతూ ఎంపీడీవో రామయ్య అవసరం ఉందంటే చాలా సార్లు రూ.20 వేలు, 30 వేలు ఇచ్చాను, తిరిగి ఇచ్చారు. గత మూడు నెలల కిందట రూ.35 వేలు అవసరం ఉందని ఎంపీడీవో నా వద్ద డబ్బులు తీసుకున్నాడు. ఈమధ్య కాలంలో నేను కిందపడి అనారోగ్యానికి గురయ్యాను. డబ్బులు అవసరం ఉందని ఎంపీడీవోను అడగడంతో నాపై కోపం పెంచుకొని బుధవారం పెంట్లవెల్లి పంచాయతీ కార్యాలయంలో ఉద్యోగుల ముందు బూతులు తిట్టారని.. దీంతో గురువారం నా డబ్బులు నాకు కావాలని గట్టిగా అడగడంతో నాపై జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయడమే కాకుండా పోలీస్‌స్టేషన్‌లోనూ ఫిర్యాదు చేశారని చెప్పారు. ఇదే విషయంపై ఎంపీడీవో రామయ్యను వివరణ కోరగా పెంట్లవెల్లి పం చాయతీ కార్యదర్శి వద్ద గతంతో చాలా సార్లు డబ్బులు తీసుకొని ఇచ్చాను.

అదే మాదిరిగానే రూ.35 వేలు చే బదులుగా తీసుకున్నమాట వాస్తవమేనని, బుధవారం గ్రామ పంచాయతీలో విధులు సక్రమంగా నిర్వహించడం లేదని, ఇది సరికాదని సూచించడం జరిగిందన్నారు. దీంతో పంచాయతీ కార్యదర్శి సాధిక్ మద్యంతాగి ఎంపీడీవో కార్యాలయానికి వచ్చి ఉద్యోగుల ముందు తనను నానా బూతులు తిట్టారని, విధులకు ఆటంకం కలిగించినందుకు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశానన్నారు. ఇదిలా ఉంటే ఆరు గ్యారెంటీలంటూ కాంగ్రెస్ అధికారంలోకి వచ్చి నెల కిందట దరఖాస్తులను స్వీకరించింది. ఇచ్చిన దరఖాస్తుల వివరాలు తెలుసుకుందామని కార్యాలయానికి వచ్చిన ప్రజలకు కార్యాలయంలో అధికారులు, ఉద్యోగుల మధ్య మాటల యుద్ధం చూసి ఇదేం కార్యాలయం.. ఇదేమీ పాలన రా బాబు అని చర్చించుకోవడం కనిపించింది.

# పదవులు కాదు.. పనులు శాశ్వతం

- మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి
- పెబ్బేరులో క్రికెట్ పోటీలు ప్రారంభం

పెబ్బేరు, ఫిబ్రవరి 8 : రాజకీయాల్లో పదవులు శాశ్వతం కాదని.. చేసిన అభివృద్ధి పనులు శాశ్వతంగా నిలిచి పోతాయని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. పెబ్బేరులో చౌడేశ్వరీ మాత జాతర సందర్భంగా గురువారం ఏర్పాటు చేసిన క్రికెట్ పోటీల ఫైనల్ మ్యాచ్‌ను ఆయన బ్యాటింగ్ చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి మాట్లాడుతూ అప్పటి సీఎం కేసీఆర్‌తో ప్రత్యేకంగా మాట్లాడి జూరాల క్యాంప్ కాలనీలో అతి పెద్ద ఆట స్థలాన్ని ఏర్పాటు చేసినట్లు చెప్పారు. అన్ని రకాల ఆటలు ఆడేందుకు పనికివచ్చే శాశ్వత గ్రౌండ్‌గా దీన్ని తీర్చిదిద్దినట్లు చెప్పారు. ఈ గ్రౌండ్‌ను అభివృద్ధి చేసి కాపాడే బాధ్యత మున్సిపల్ పాలకవర్గం తీసుకోవాలని సూచించారు. భవిష్యత్తులో చేపట్టబోయే పనులకు తన సహకారం తప్పకుండా ఉంటుందని హామీ ఇచ్చారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కరుణశ్రీ, వైస్‌చైర్మన్ కర్రెస్వామి మాట్లాడుతూ మా జీ మంత్రి నిరంజన్‌రెడ్డి కృషి పట్టుదల వల్లే ఈ గ్రౌండ్ ఏర్పాటైందని, పెబ్బేరు చుట్టుపక్కల క్రీడాకారులకు ఇది ఎంతో ఉపయోగపడుతుందని తెలిపారు. హనుమాన్, ఆజాద్ యూత్ ఆధ్వర్యంలో నిర్వహించిన పోటీల్లో నాయకులు జగన్నాథం, వనం రాములు, దిలీప్‌రెడ్డి, బుచ్చారెడ్డితోపాటు కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



బ్యాటింగ్ చేస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

# కందులు @ రూ.10,062

జడ్చర్ల, ఫిబ్రవరి 8 : బాదేపల్లి వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 7 క్వింటాళ్ల కందులు అమ్మకానికి రాగా గరిష్ఠంగా రూ.10,062, కనిష్ఠంగా రూ.9,619, మధ్యస్థంగా రూ.9,980 ధర పలికింది. 4,578 క్వింటాళ్ల వేరుశనగ రాగా గరిష్ఠంగా రూ.7,239.., 3 క్వింటాళ్ల బెబ్బర్లు రాగా గరిష్ఠంగా రూ.7,482.., మూడు క్వింటాళ్ల మొక్కజొన్న రాగా గరిష్ఠంగా రూ.2,101, 10 క్వింటాళ్ల ఆర్ఎన్ఆర్ రాగా గరిష్ఠంగా రూ.3,159 ధర పలికింది.